# భారతదేశం వైజ్ఞానిక ప్రకాశవంతమైన దేశం!

## 'భా' అనే ఒక అక్షరానికే ప్రకాశం వెల్తురు అనే అర్థాలున్నా, వీరశౌర్యసాహసాలు చేయకలదని గ్రహించాలి!

## -విశ్వానికి విజ్ఞాన వెల్తుర్లు ప్రసరింపచేసిన దేశం!!

వెల్తురు జ్ఞానానికి సంకేతం. అజ్ఞాన చీకట్లను తొలగించి జ్ఞానం ప్రసాదించిన పుణ్యభూమి భారతభూమి. కాబట్టే- ఈదేశం 'భా'రతదేశమయింది. భరతవర్షమనబడింది. భరతఖండమనబడింది. అన్యదేశములు వేటికినీ ఖండములనే పేరు కలుగలేదు; వర్షములనే హర్షప్రదేశములుగా వర్ణింపబడలేదు.

నిరంతర జ్ఞాన విజ్ఞాన తరంగాలు ప్రసరింపబడుతున్న కారణంగానే పుట్టుకతోనే భారతీయులు జ్ఞాన వికాసవంతులుగా దీప్తినొందారు. విశ్వానికి వేద విజ్ఞాన్ని ప్రసరింపచేయకలిగారు.

వేదములు పుట్టిందిచటనే! వేదము ప్రవచింపబడిందిచటనే. వేదముల్లో ప్రవచించబడిన సమస్తమూ, ఆహారం పండించుకోవడం నేర్పింది, అన్నం వండుకుని తినడాన్ని నేర్పింది. ఏయే శాకపాకాల్ని వండుకోవాలో అన్నది కూడా వేదం నేర్పింది. అన్నాన్ని పరబ్రహ్మస్వరూపమంది. అన్నం వినాశక్తిలేదన్నది.

'భా' అనే ఒక్క అక్షరానికి ప్రకాశం, ప్రకాశవంతం అనే అర్థాలున్నాయ్. ప్రకాశం అంటే వికాసం; విజ్ఞానవికాశం.

వెల్తురు జ్ఞాన సంకేతమైనది. జ్ఞానంలో వెల్తురు ఉన్నది. జ్ఞాన వెల్తురులో విజ్ఞానం ఉన్నది. అజ్ఞాన చీకట్లను తరిమి పోగొట్టే అఖండ విజ్ఞాన శక్తి ఉన్నది.

ఋషి నోట పలికిన పలుకులే జ్ఞానం. కేవలమూ చదువుల వలన, జ్ఞానం కలుగదు. చదువుల సారం గ్రహించాలి. జ్ఞానియైన బాలుడు ప్రహ్లాదుడు - చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి' - అని హిరణ్యకశిపునికి కెరుకపరుస్తారు పోతనగారు. చదువుల్లోని మర్మము అంటే చదువులసారం, చదువులసారం ధర్మం ధర్మాచరణ ధర్మథ మర్మం.

రామవిభుడు పుట్టి రఘుకులంబలరించె

కురువిభుండు పుట్టె కులము చెరచె - వేమన యోగీంద్రుడు అన్నారంటే ధర్మమార్గాన్ని ధర్మాచరణమన్నారు.

కొన్ని వేల వేయి సంవత్సరాల క్రితం త్రేతాయుగంలో దశరథ కుమారునిగ శ్రీరాముడు అవతరించి ధర్మపాలనము చేసి, రఘువంశాన్ని తరింపచేసాడు. అటుపిమ్మట ద్వాపరయుగము వచ్చింది. కౌరవ వంశమున కురుసార్వభౌముడు దుర్యోధనుడు పుట్టి కురువంశ గౌరవాన్ని కూల్చాడు; కురువంశాన్ని కూల్చాడు.

అలా అలాటి కురువంశ విభుల్లా రాజకీయ నాయకులు ఉద్భవిస్తూన్నారు. భారత సామ్రాజ్య ప్రజాస్వామ్యంలోని సౌమత్యాన్ని వేళ్ళకంటూ పెకలించి వేస్తున్నాడు. కానీ ఆనాటి పాండవులు అయిదుగురిలా ప్రజాస్వామ్య సౌరభత్వాన్ని సౌకభించింపచేసేవారు కనపడడం లేదు. అన్నదమ్ముల బిడ్డల ద్వేషం జనించింది.

అన్యదేశస్థుడైన తురకవాడు ఏనాడు అడుగుపెట్టాడో ఆనాడే దేశసంపద కొల్లగొట్టపడింది. తమ దేశాలకు తరలించారు. ఏనాడు బ్రిటిషువాడు అడుగుపెట్టాడో, ఆనాడే సంస్కృతి, భాష అణగద్రొక్కబడింది.

మాతృభాషను అధ్యయనం చేయకుండా ABCD లనే ఆంగ్ల అక్షరాలను ఆయన చేరాధింపచేశాడు. ఆసేతు హిమాచలపర్యంతమూ పాలించిన తెలుగువాడు అదృశ్యుడయ్యాడు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వంటి కాశ్మీర్ దేశభక్తుడు చంపబడ్డాడు. కాశ్మీర్‌రాజు పదవీచ్యుతుణ్ణి చేసారు. కాశ్మీర్‌లో గల హిందీ పండిట్లను (పౌరులను) తరిమివేసారు. అక్కడి హిందూ సామ్రాజ్యాన్ని కూల్చివేసారు. కాశ్మీర్ అజాద్ కాశ్మీర్, జమ్మూ కాశ్మీర్‌లుగా విభజింపబడ్డాయ్. ఆజాద్ కాశ్మీర్‌తో పాక్ సంతృప్తిపడకుండా, జమ్మూ కాశ్మీర్‌లోకి చొరబడింది, అలజడులు సృష్టిస్తున్నది. దీనివెనుక ఉన్న పాక్ అదృశ్య హస్తం దృశ్యమైంది. మోడీ ప్రధాని అయిన తరువాత టెర్రరిస్టుల గుడారాలను కూల్చేసాడు. భారత్ ఇంత సాహసం చేస్తుందని పాక్ ఊహించలేదు. విశ్వానికే విజ్ఞాన, వీరశూరత్వాన్ని ఎరుకపరచిన, భారత్ పాక్ ఆగడాలకు, సహింపనేరదని పాక్ గ్రహించాలి. కలియుగం ప్రవేశించింది. కలి క్రౌర్యాన్ని చూడలేక, బాధను సహింపక ఓరిమినలవరచుకొంది. ఆర్యధర్మం క్షీణిస్తూ వచ్చింది. గురు ఆశ్రమంలో చేరి ధర్మబద్ధమైన విద్యనభ్యసించే తీరు మారింది గురువులే, జ్ఞానవంతులు, క్రమశిక్షణలేమి వారైనప్పుడు - విద్యార్జునులో జ్ఞానవిద్య కలుగుననుట సత్యదూరమవుతుంది కదా! అదే జరిగింది. భారతదేశాన్ని దోచుకోవడానికి అన్యదేశీయులు, చొరబడ్డారు. స్వదేశ ప్రాంతాల్లోని రాజుల అసమర్థతను తురకలు గ్రహించారు.

భారతీయ ఔదార్యగుణంతో వారికెంతో గౌరవంతో సహకారం చేస్తున్నారు. పౌరసత్వం కల్పించారు. ఎన్నికల్లో పాల్గొనే అవకాశం యిచ్చారు.

కానీ పాకిస్థాన్‌లో ఉండే హిందువులకే గౌరవం ఉన్నదా? ద్వేషం, ద్వేషంతో స్వతంత్రం ఉన్నదా? గౌరవం ఉన్నదా? లేదు, లేదు. ఆంధ్రా ఎం.పీ.గా ఉన్న ఓ ముస్లిమ్ నేను భారతీయుణ్ణి కాను, భారతమాతాకా జై అననంటే ఆయన్నెన్నుకున్నది మన తెలుగువాళ్ళే. ●

# భిక్షను స్వీకరించడం తప్పుకాదు!

## కురుమ జాతి కులవృత్తి భిక్షాటనం, గుణవృత్తి ఒగ్గు వాయిద్యం!

శివునికి ఆదిభిక్షువు అనే పేరుంది. శైవ సిద్ధాంత పరులైన ఆచార్యులు ఊరూరా బసచేస్తూ, గృహస్థుల యింటికి భిక్షకు వెళ్లేవారు. త్యాగరాజస్వామి సంచారం చేస్తూ, నామసంకీర్తనం చేస్తూ వచ్చిన బియ్యమునే వండించుకుని, శ్రీరామునికి నివేదించి, ప్రసాదంగా భుజించేవారట. అతిధులు కనుక వస్తే, వారికే ముందుగా పెట్టి, పసిపిల్లలకు పెట్టి, శేషించినదే భుజించేవారట. ఇది కొంతమందికి కులాచారమైంది.

కురుమ జాతి యనే ఒకజాతివారు పెద్ద పెద్దడోళ్లూ తప్పెటలు వాయిస్తూ నృత్యంచేస్తూ ఆనందిస్తూంటారు. వీరి వాద్యాన్ని 'ఒగ్గు' అంటారు. 'ఒగ్గు' వారని కూడా పిలుస్తారు. వీరి దైవం శివుడు. మల్లికార్జునస్వామి మల్లన్నే వీరి దైవం. అందుకే వీరిలో చాలామందికి మల్లన్నలనీ, వీరశైవులు కాబట్టి బీరన్నలనీ పేరులుంటూంటాయ్. వీరు గొర్రెలనూ, మేకలనూ పెంచుతూంటారు. అయితే వీరికి లింగధారుల్లా లింగధారణ లేదు. వీరభద్రుణ్ణి పూజిస్తూంటారు.

శివుని వరంతో మల్లన్న కాపుల యింట్లో పుట్టినట్టూ, మల్లన్న రెండవ భార్య రత్నాంగి బ్రాహ్మణ పిల్లయినట్టూ, ఆమె సంతానమే బీరన్న అయినట్టూ, వాళ్లందర్నీ కురుమ జాతిలో బీరన్న వర్గంగా భావిస్తున్నట్టూ ఓ కథ ఉంది. నాగరికత పెరిగినప్పటికినీ, బీరన్నలోని పలుమంది 'కులవృత్తి మేలు గువ్వల చెన్నా' యని బ్రతుకుతున్నట్టూ జానపదుల్లో జాణ జనపదాలను పాడుతున్నట్టూ తెలుస్తూంది. ఈ 'జానపదపు నిగ్గును చూపేదే ఒగ్గు'.

**శ్వాస ప్రాణికీ, విశ్వాసం మనిషి అభ్యున్నతికీ దోహదమిస్తుంది. శ్వాస నిలకడ లేనప్పుడు మనిషి అవస్థ పడినట్టుగానే, విశ్వాసం లేని మనిషిలో జీవన మనుగడ నిలకడగా ఉండదు- విశ్వాసమున్నవాడు గాలి తెరలకు రెపరెపలాడకుండా నిలువెత్తు సమున్నతను సముపార్జించుకుంటాడు.**



# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

**101**

## పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

**27. రాగీ కర్మఫల ప్రేప్సు ర్లుబ్ధో హింసత్మకోऽశుచిః**
**హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః**

**వ్యాఖ్య :** ఈ పై లక్షణములను గలవాడు రాసకర్తయని చెప్పబడుట వంలన, ఉత్తముడగువాడు ఆ లక్షణములను త్యజించివేయవలెననటు సుస్పష్టము. అనగా బంధ్వాదులందును, ఇతర ప్రాపంచిక పదార్థములందును అనురాగము (అభిమానము) లేకుండవలెను. కర్మఫలమును కోరరాదు. ఏ ప్రాణిని హింసింపరాదు. అశుభ్రతను త్యజించవలెను. కార్యము యొక్క సిద్ధి, అసిద్ధులందు హర్షశోకములను మనోవికారములు లేకుండ సమచిత్తుడై, ద్వంద్వసహిష్ణువై యుండవలెను. ప్రతివాడును తన హృదయమును పరిశోధించుకుని ఈ పైనదెలిపిన రాజసకర్తయొక్క లక్షణములున్నచో వానిని ప్రయత్నపూర్వముగ విడనాడి సాత్త్వికకర్తయే అయియుండులాగున చూడవలెను.

**28. అయుక్తః ప్రాకృతః స్తబ్ధ శ్శఠో నైష్కృతికోऽలసః**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే**

**వ్యాఖ్య :** 'అయుక్తః' - మనస్సు బహిర్ముఖముగాను, చంచలముగాను నుండు వాడు, ఆత్మయందు నిలకడలేనివాడు, ఏకాగ్రత, నిగ్రహము లేకయుండువాడు అయుక్తుడనబడును. ఆత్మతో, భగవంతునితో తనయందలి ప్రకృతి గుణములను తొలగించుకొని అప్రాకృతుడుగ, దైవస్వరూపుడుగ మారవలెను.

'నైష్కృతికః'- ఇతరుల కార్యములను చెడగొట్టువాడు. ఇతరులను వంచించు వాడు. సామాన్యముగా జనులు నాలుగు రకములుగ నుందరు (1) తన సుఖమును గూడ చూడక ఇతరులకు మేలుచేయువాడు (2) తన సుఖము చూచుకొనుచు ఇతరులకు హితమొనర్చువాడు (30) తన సుఖము కొఱకు పరులకు కీడు చేయువాడు (4) అనవసరముగా ఇతరులను కీడుచేయువాడు, మొదటివాడు ఉత్తముడు, రెండవవాడు మధ్యముడు. మూడవవాడు అధముడు. నాల్గవవాడు అధమాధముడు ఈ శ్లోకమున తెలుపబడిన 'నైష్కృతికులు' చివరి రెండు తరగతులకు జెందినవారు.

'అలసః' - సోమరి- భగవానుడు సోమరితనమునకు తామసగుణమగు జెప్పదానిని పారద్రోలవలసినదిగా బోధించుచున్నారు. సోమరి ఏ రంగమందును వృద్ధికి రానేరదు. ఆధ్యాత్మరంగమున సోమరులకు చోటేలేదు.

'విషాదీ' - తామసకర్త ప్రతికార్యమందును ఏడుపుమొగము పెట్టుకొని యుండును. వాస్తవముగ అనంతానందపరిపూర్ణుడగు మానవుడు విషాదయుక్తుడై మూలుగుచుండుట కేవలము అజ్ఞానమువలననే యగును. కావున గంభీరమగు స్వస్వరూపముగా నెఱింగి విషాదమును పారద్రోలవలెను.

'దీర్ఘసూత్రి' -- మందకొడిగ ప్రవర్తించువాడు. తాబేలు నడకవంటి గమనము గలిగి చిన్న పనిని గంటలతరబడి చేయుచు, లేక అసలే చేయక 'వాయిదా' వేయుచునుండును. తామసకర్త 'తరువాత చూచెదములే' అను ప్రమత్తతో గూడిన భావము గలిగియుండును. మహాభారతములోని శాంతిపర్వమున భీష్ముడు ధర్మరాజునకు 'దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రి' అను మూడు చేపలను గూర్చి బోధించిన విషయమీ సందర్భమున జ్ఞప్తికి తెచ్చుకునుట యుక్తము. ఆ మూడు చేపలలో దీర్ఘదర్శి దూరపు ఆలోచనగలది. ప్రాప్తకాలజ్ఞుడు కొంత ప్రయత్నములోపముగలది. దీర్ఘసూత్రి ఏ ప్రయత్నము చేయని సోమరి. (కథలో బెస్తవాని వలలోపడి మరణించును). కాబట్టి ఇట్టి దీర్ఘసూత్రత్వమును, అలసత్వమును, సోమరితనమును ముముక్షువులు దరికిచేర్చరాదు. అమూల్యమగు మానవజన్మను బడసి భగవత్ప్రాప్తికై యత్నింప సోమరిగ కాలము గడుపుట మహాప్రమాదకరమని యెఱుంగవలెను.

**29. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రి విధం శృణు**
**ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధన ఞ్జయ!**

**వ్యాఖ్య :** ఓ అర్జునా! బుద్ధియొక్కయు, ధైర్యముయొక్కయు భేదమును గుణములను బట్టి మూడు విధములుగా వేఱ్వేఱుగను, సంపూర్ణముగను, చెప్పబడుచున్నదానిని (నీ విపుడు) వినుము.

**30. ప్రవృత్తిం చ నివృత్తించ కార్యాకార్యే భయాభయే**
**బన్ధం మోక్షం చ యా వేత్తి బుద్ధిస్సా పార్థ! సాత్త్వికీ.**

**వ్యాఖ్య :** స్వాత్త్వికబుద్ధి మంచి చెడ్డల రెండిటిని గూర్చి తెలిసికొని మంచిని గ్రహించి చెడ్డను వదలివేయుచుండును. అట్లే బంధము, మోక్షము రెండిటిని తెలిసికొని బంధమును పరిత్యజించి మోక్షమును గూర్చి యత్నించును. అదే విధమున భయరూపమగు ఈ దృశ్యసంసారస్థితిని జూచి, దానియెడల విరక్తిగలిగి, అభయరూపమగు నిత్యానంద పరమాత్మనే ఆశ్రయించి తరించును. అట్టి సాత్త్వికబుద్ధియే ఉత్తమోత్తమమైనది. కాబట్టి బుద్ధి తమకు కలదాయని ప్రతివారును యోచించుకొని భగవద్దృష్టిలో 'బుద్ధిమంతులై' వర్తించుటకు ప్రయత్నించవలెను. ఇట్టి లక్షణములుగల బుద్ధిలేనిచో ఎంతటి పాండిత్యము, లౌకికప్రజ్ఞ యున్నప్పటికిని జనులు బుద్ధికొఱవడినవారే యగుదురు.

**31. యయా ధర్మమధర్మం చ కార్యం చాऽకార్య మేవచ**
**అయథా వత్ప్రజానాతి బుద్ధిస్సా పార్థ! రాజసీ.**

**వ్యాఖ్య :** కొందఱిబుద్ధి ధర్మాధర్మములను, కర్తవ్యాకర్తవ్యములను శాస్త్రములందు బోధింపబడిన రీతిగగాక, పెద్దలగు గురువులు తెలిపినరీతిగా గాక మఱియొక విధముగ పొరబాటుగ గ్రహించును. అట్టి బుద్ధి రాజసమైనది. దానిని సంస్కరించి సాత్త్వికబుద్ధిగా ప్రయత్నముచే మార్చుకొనవలెను.

**32. అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాऽవృతా**
**సార్వార్థాన్విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ! తామసీ.**

**వ్యాఖ్య :** తామసబుద్ధి గలవానికి అంతయు తలక్రిందులుగనే కనిపించును. వికారమైన అద్దములో ముఖము వికృతముగ గనుపించునట్లును, నీటిలో ప్రతిబింబము తలక్రిందులుగ భాసించునట్లును, తామసబుద్ధియున కంతయు విపరీతముగ తోచును. 'సర్వార్థాన్' అని చెప్పినందువలన ఒక విషయము కాదనియు, నిత్యజీవితములో ప్రతివిషయమున్ను అతనికి విరుద్ధముగ గన్పట్టుననియు తెలియుచున్నది. దీనికంతటికిని కారణమేమి? - తమసాऽవృతా'- బుద్ధి అవిద్యచే, అజ్ఞానముచే, అవివేకముచే గప్పబడుటయే కారణము. కల్లుత్రాగినవానికి లోకము తిరుగుచున్నట్లు గోచరించు విధమున, మాయమోహమదిరాపానముచే మత్తుడైయున్న అజ్ఞాని కీ జగత్తంతయు వాస్తవముగ గోచరించును. దృష్టాంతమునకు-

(1) లేని దేహము, జగత్తువారికి ఉన్నట్లు చూపట్టును. ఉన్న ఆత్మ (దైవము) లేనట్టు కన్పించును.

(2) దుఃఖభూయిష్టములైన విషయభోగములు వారికి సుఖకరములుగ తోచును. పరమానందదాయక మగు ఆత్మ (దైవము) వారికి రుచింపకయే యుండును

(3) రక్తమాంసమయమగు క్షణిక దేహమందు వారు సౌందర్యబుద్ధి గలిగియుందురు. సచ్చిదానంద ఘనమగు శాశ్వతపరమాత్మయందు హేయబుద్ధిని జూపుదురు.

వెయ్యేల, ధర్మమును అధర్మముగ జూచుదురు. అధర్మముగ భావించుచుందురు. దీనికంతటికిని కారణము అవివేకమేయని ఇదివఱలో తెలుపబడియున్నది. కావున ఏ బుద్ధియందు అట్టి విద్య, తమస్సు కాపురముందునో ఆ బుద్ధి మహానికృష్టమైనదియే యగును. అతడెంతటి భౌతికబలయుతుడైనను, విజ్ఞాన సంపన్నుడైనను సరియే. కాబట్టి వివేకము నాశ్రయించి ప్రయత్నపూర్వకముగ అట్టి తమనస్సును బుద్ధి నుండి పారద్రోలి, సత్యమును సత్యముగను గ్రహించు శక్తిని సంపాదించి కృతార్థుడు కావలయును.

*(తరువాయి వచ్చే సంచికలో)*

# ఆంధ్ర సాహిత్యం అద్వితీయంగా భాసిల్లింది! కలకాలమూ నిలిచే కవితలు కావ్యాలూ పుట్టాయ్!

శకాలు వారీగా వెనుకకు వెడితే, చరిత్రను పరిశీలిస్తే ఎందరోకవులు, వారు వ్రాసిన ఎన్నో గ్రంథాలు, కావ్యాలూ, వారిని పోషించిన రాజులూ మనముందు ప్రత్యక్షమవుతారు.

కవిత్వం చెలువొందడానికి గానీ, కవులకు గానీ రాజపోషణ ప్రధానం. ఆ రోజుల్లో అనగా క్రీ.శ. 1550–1750 సం॥ముల మధ్య రెండు వందల సంవత్సరాలు రాజ్యమేలిన నాయక రాజులు ఎందరో కవులను పోషించారు. ఎన్నో కావ్యాలు వెలువడడానికి కారకులయ్యారు.

వనిత, లత, కవితకు ఆశ్రయం కావాలి. ఆరోజుల్లో ఈ మూడిటికీ పుష్కలమగు పోషణ లభించింది. తెలుగు ప్రాంతాలకు దక్షిణమున తంజావూరు పట్టణమున్నది. ఈ పట్టణమును రాజధానిగా చేసుకుని పాలించిన నాయక వంశపు రాజులు ఆలయ నిర్మాణంతో బాటు, కవులచే ఎన్నో ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను రచింపచేశారు. వ్యాకరణ గ్రంథాలను రచింపచేశారు. ఆధ్యాత్మికత మానవ ఉన్నతస్థితిని తెలియచేస్తుందని విశ్వసించారు. ఆదర్శ జీవునిగా మనిషి బ్రతకడానికి తగిన నారు నీరులను నీతి ధర్మమార్గాల ద్వారా సూచించారు. జీవితానికో నిబద్ధతను, నిజాయితీని, నిర్మల చిత్తాన్ని కల్గించడానికి తోడ్పడుతుందని భావించారు. రాజులు కూడా ఈ విజ్ఞాన సువాసనలు సోకే, తెలుగులో కవిత్వములు చేశారు. తెలుగుతనాన్ని పులుముకున్నారు.

క్రీ.శ. 1550–1750ల మధ్య కాలం నాయక రాజుల యుగమనే చెప్పాలి. చాలావరకూ పాలకులందరూ సాహితీ ప్రియులే! పూవు చుట్టూ భ్రమరములు చేరుతాయన్న చందాన కవులు, కవయిత్రులు తంజావూరును తమ వాసయోగం కావించుకుంటూ వచ్చారు. వీరిలో రఘునాథ నాయకులు, విజయ రాఘవ నాయకుల పేర్లను ఎక్కువగా చెప్పుకుంటూండేవారు. ముఖ్యంగా విజయరాఘవ నాయకుని కాలం స్వర్ణకాలం అంటారు. కవులకూ, కవయిత్రులకూ అది బంగారు యుగం. రాజు స్వతహాగా కవి. తెలుగు నాటక ప్రియుడు, తెలుగు నాటక కర్త. అందుకే ఆనాడు రూపక కావ్యాలెక్కువగా వెలువడ్డాయ్. యక్షగాన చరిత్రలు వెలువడ్డాయి.

తొట్ట తొలి యక్షగానం ఆయన కాలంలోనే, ఆయన ప్రోత్సాహంతోనే వెలువడింది. అదే 'విప్రనారాయణ'. అటు తర్వాత 'విప్రనారాయణ' నాటకంగా వరలింది. తెలుగు నాట 'విప్రనారాయణ' నాటకం బహు ప్రదర్శన లివ్వబడింది. రెండు మూడు పర్యాయములు వెండితెర మీద దృశ్యకావ్యంగా వెలువడింది. వీటికన్నిటికీ మూలం క్రీ.శ. 1550 ప్రాంతంలో వెలువడిన యక్షగానం విప్రనారాయణయే! ఈ యక్షగానాన్ని చక్రపురి రాఘవాచార్యులు గారు వ్రాశారు. రాజులూ, కవులూ వైష్ణవ భక్తిపరులు కావడం, వైష్ణవాన్ని ప్రచారంలోనికి తేవడం ఓ ముఖ్యోద్దేశం కూడా అయ్యింది. ఇలా ఇలా చాలా కవుల గ్రంథాలు కావ్యాలుగా వెలువడినప్పటికినీ, ఆ కాలంలో రాజప్రాపకంలో పేరొందిన ఇరువురి కవయిత్రులను చెప్పుకుని తీరాలి. వారు రంగాజమ్మ, రామభద్రమ్మ పేరులు కూడా వైష్ణవ పరనామధేయంగా ఉన్నాయ్!

రంగాజమ్మ 'మన్నారు దాస విలాసం' అనే కావ్యాన్నీ, రామభద్రమ్మ 'ఉషా పరిణయం' కావ్యాన్నీ రచించారు. విజయ రాఘవ నాయకునికి అంకితం యిచ్చారు. గణపువరపు వేంకటకవి రచించిన 'వేంకటేశాంధ్ర' కావ్యాన్ని బట్టి – అదీ భక్తితత్వ గ్రంథమేనని తేలుతూంది. ఆయనే 'అకా'రాది దేశీయాంధ్ర నిఘంటువును కూర్చారు. భాష పేలవం కాకుండా, ఆనాడే నిఘంటువులు, వ్యాకరణముల్ను కూడా రాజులు ప్రోత్సహించారని తెలుస్తూంది. ఇందుకు బలమైన ఉదాహరణంగా, ఇంతపూర్వం 'సులక్షణ సారం' గ్రంథాన్ని లింగమగుంట తిమ్మకవి పూరించారని, దీన్ని చిన్న బాలశిక్షగా భావించేవారనీ అంటారు. పద్యలక్షణ గ్రంథంగా 'బాలబోధచ్ఛందం' గ్రంథాన్ని కూడా ఈయనే రచించారు. కొమరవరపు వేంకట సోమయాజి – ఈయన యజ్ఞాల్ను కూడా చేశారు. 'రఘునాథ నాయికాభ్యుదయం' కావ్యాన్ని వ్రాశారు. బహుశ ఇది నాయకరాజుల్ని మెప్పుకోలు కోసం వ్రాయబడి ఉండవచ్చు.

విజయ రాఘవనాయకుడు కవి పక్షపాతియని ముందే చెప్పుకున్నాం. అనేకానేక గ్రంథాలు ఈయన కాలంలోనే వెలువడి, తంజావూరు సరస్వతీ గ్రంథాలయమందు భద్రపరచినట్టు తెలియవస్తుంది. ఇప్పటికీ ఎన్నో తాళపత్ర గ్రంథాలు, వ్రాత గ్రంథాలు తెలుగులోనివి సరస్వతీ గ్రంథాలయంలో ఉన్నవంటారు.

ఆరోజులు భాషాభిమానులు, భాషా బోధనానికి అతీతులు. తెలుగు, తమిళ, కన్నడ, మరాఠ కవుల్ని భేదరహితంగా ప్రోత్సహించారు, పోషించారు. కొందరు నాయకరాజులు తెలుగులో కావ్యాలు వ్రాశారు. రాజుల కొలువులో నృత్యం చేసే కన్నియలు కూడా కవయిత్రులే! ఆరోజుల్లో ద్వారబంధాలూ, గోడలకూ కూడా తెలుగు కవిత్వం అబ్బేది.

నాయకరాజులు తరువాత రెడ్డిరాజులు కూడా భగవద్భక్తీ, బ్రాహ్మణభక్తీ కలవారూ – వీరూ తెలుగు కవులను అమితంగా ప్రోత్సహించారు. శ్రీనాధుడు కవితా ప్రస్థానంలో ఘనసత్కారములను పొందాడు. ఆయన్ను 14వ శతాబ్దం వాడంటారు. శృంగార రసభావం ఆయన కావ్యాల్లో ఎక్కువగా ఉంటుంది. ఆంధ్ర కర్ణాటక ప్రాంతాలలోని రాజులందర్నీ చూచినవాడు, రాజదర్బారులందు గౌరవింపబడినవాడు. మరుత్తరాట చరిత్రం, భీమఖండం, కాశీఖండం, శివపురాణం, శృంగార నైషధం గ్రంథాలను రచించినవాడే, హరవిలాసం, శివరాత్రి మహాత్మ్యం, పల్నాటి వీరచరిత్రల ద్వారా పేరు ప్రఖ్యాతులు పొందినవాడు, కవి సార్వభౌముడు బిరుదాంకితుడు.

అదే కాలంలో శ్రీనాధుని తరహాకు భిన్నంగా, నిరాడంబరంగా ఉంటూ 'మదాంధ్ర భాగవతం' కారణంగా పేరుగొన్నవాడూ, తెలుగు పద్యానికి విలువ తెచ్చినవాడూ. శబ్ద, అర్థ అలంకారాలను సమంగా పోషించిన, సిసలు తెలుగు మంజుల, మధుర కవిగా పేరొంది, ఈనాటికినీ ప్రజల మనఃఫలకాలపై మెదులుతున్న వ్యక్తి బిరుదుల కతీతుడూ, రామభక్తి పరుడైన బమ్మెర పోతనామాత్యుడు. సర్వజన హృదయమందారుడు. తన గ్రంథాలన్నీ శ్రీరామచంద్రునికే అంకితమిచ్చాడు. ఈయన మనుమసిద్ధుని రాజ్యంలోనివాడు – రాజసత్కారాలను తిరస్కరించినవాడు.

ఈకాలంలోనే వల్లభరాయుడనే కవి వీధి నాటకాన్ని వ్రాయడం, విన్నకోట పెద్దన్నగారు 'కావ్యాలంకార సంగ్రహం' అనే వ్యాకరణ గ్రంథం పూరించడం, పాంచాలీ పరిణయం, రాజవాహన విజయం గ్రంథాలను కాకమాని మూర్తి కవీంద్రుడూ, బహుళ చరిత్రను దామెర్ల వెంగళరాజులు వ్రాయడాన్ని చరిత్రలో దాఖలైన వివరాలు. ఇంకా ఎందరెందరు కవులు ఎన్నెన్ని కావ్యాలూ, గ్రంథాలు వ్రాశారో – అముద్రితాలుగానే నిలిచిపోయాయో!

1627–1697 కాలం నాటివాడే యోగి వేమన అనబడు పెదకోమటి అనవేమారెడ్డి కొండవీటి రెడ్ల రాజవంశం వాడు, విలాస జీవితం గడిపి, విరాగియై, యోగియై, సర్వసంగ పరిత్యాగియై –

**తల్లి గర్భమందు తాబుట్టినప్పుడు**
**మొదట బట్టలేదు తుదన లేదు**
**నడుమ బట్టగట్ట నగుబాటు కాదయా –**

– అంటూ మొలనున్న గుడ్డను తీసి పారవేశాడు. విరాగి జీవితంలోనే వేలకొలదీ పద్యాలను వ్రాశాడు. బ్రౌనుదొరే గనుక శ్రద్ధబూనకుండా వుంటే ఆ పద్యాలు మనదాకా వచ్చేవికావు. మనకు దక్కవలసిన నీతి పద్యం సంపద మనకు దక్కేదికాదు. నాలుగు దశాబ్దాల క్రిందటి సంపదను మనకందించిన విలియం బ్రౌను దొరకు కృతజ్ఞతలందచేద్దాం.

తెలుగు వాఙ్మయ అభివృద్ధికి శతవిధాలుగా కృషిచేసినది రాయల యుగం,

*(తరువాయి 12వ పేజీలో)*

# ఆంధ్ర భాషా ప్రశస్తి

తెలుగు సాహిత్యాన్ని పోషించిన రాజుల్లో 1509 సం॥ము నుంచీ తుళువ వంశం ప్రారంభమైంది. అందరి సాహితీ ప్రియుల నోటికి అందని అనేకమంది రచయితల్నీ, వారి గ్రంథాల్నీ ఇందుదహరిస్తున్నాం.

'రుక్మాంగద చరిత్ర' వ్రాసిన ప్రౌఢ కవి మల్లయ్య ఉత్తర నరసింహ పురాణం రచించిన హరిభట్టు, ఇందుమతీ కల్యాణం రచించిన అంగద బసవయ్య, త్రిపుర విజయం వ్రాసిన పెదపాటి సోమయ్య, నచికేతో పాఖ్యానం రచించిన చందలూరి చిక్కయ్య, అమరుకం రచించిన కానుకొలను అన్నమయ్య, బృహన్నారదీయం రచించిన వాసిరాజు రామయ్య, 'బాలభారతం' రచించిన కాకమాని గంగాధరుడు, సౌగంధికాపహరణం' రచించిన రాయసం గణపయ్య, 'కాంచీ మహాత్మ్యం' రచించిన కుడిచెర్ల తిప్పరాజు, 'శైవాచార సంగ్రహం' రచించిన కుంటుముక్కల అమ్మయ్య, 'భేతాళ పంచవింశతి వ్రాసిన పోతరాజు, 'దశావతార పద్యాలు' రచించిన భీమన్న, 'అష్టమహిషీ కల్యాణం' రచించిన రెడ్డిపల్లి ముద్దమరాజు, మరో 'త్రిపుర విజయం' వ్రాసిన పోతరాజు వీరయ్య, 'శాకుంతలం' వ్రాసిన సిద్ధన ప్రగడ.

**మరి రాయల యుగంలో -**

రామాభ్యుదయం - అయ్యలరాజు రామభద్రుడు, పాండురంగ మహాత్మ్యం, హరివిలాసం, కందర్ప కేతువిలాసం' వ్రాసిన తెనాలి రామకృష్ణుడు.

కాళహస్తీశ్వర శతకం రచించిన ధూర్జటి కవి, వసుచరిత్ర, హరిచంద్ర నలోపాఖ్యానం, కావ్యాలంకార సంగ్రహం వ్రాసిన రామరాజ భూషణుడు - ఈయన్నే భట్టుమూర్తి అంటారు. రామాయణం కర్త ఆకుమారి మొల్ల, కుకుత్స విజయం వ్రాసిన మట్ల అనంతరాజు, కవికర్ణ రసాయనం వ్రాసిన సంకుశాల నరసయ్య, కృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్న తాళ్లపాక అన్నమాచార్యులు గారి మనుమడు తాళ్లపాక చిన్నన్న లందరూ ఎరిగినవారే! ఏ కొందరో ఎరగని వారుండవచ్చు.

కొందరు మాత్రమే ఎరింగిన మరో కవయిత్రి ఉన్నారు, ఆమె పేరు మోహనాంగి. ఆమె కృష్ణదేవరాయలు కుమార్తె. తండ్రి వలెనే కవయిత్రి ఆమె కొన్ని గ్రంథాలను రచించారు. హిందూ రాజుల వైభవం పరస్పర విద్వేషాలతో తగ్గిపోయింది. బహమనీ రాజుల ప్రాబల్యం వచ్చింది. కుతుబ్‌షా వంశం వారందరూ తెలుగు భాషా ద్రోహులు కారు, కులికుతుబ్‌షా స్వయంగా కవి. తెలుగు కవితా రచనల్ని చేశాడు. 'దివాన్' పేరుతో వ్రాసినట్టు, ఆ గ్రంథాలు తంజావూర్ సరస్వతీ గ్రంథాలయంలో ఉన్నట్టు తెలుస్తూంది. ఆయన ఉర్దూ, పారశీక భాషల్లో కూడా రచనలు చేశాడు. తానీషా తెలుగు బ్రాహ్మణుల్ని తన కొలువులో పెట్టుకున్నాడు. వీరి సామంతులూ, వజీర్లూ తెలుగు భాషను ప్రోత్సహించారని తెలుస్తూంది.

- ('మిహిర' లోని కొన్ని విషయాల సంగ్రహణ - కృతజ్ఞులం)

# కాలానుగుణంగా కవులు మారవలసిందే!

## - మహాకవులు తిరుపతి వేంకట కవులు వక్కాణించిన మాట! -



తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు' నాటకం హృద్యమైన పద్యాల కారణంగానే ప్రాచుర్యం పొందింది. పద్య నాటకాలకు ప్రాణం పోసింది.

పద్యం తెలుగువారి సొత్తు. పద్యం పాడనివారు, పాడలేనివారూ, పండితులూ, పామరులు సహితమూ పద్యమును తెలుగు భాషకు ప్రాణశక్తిగా భావించారు. మధురమైన మంజుల భాషలగా తెలుగేతరులు ప్రశంసించారు.

కొందరు ఛాందసులు పద్యాన్ని గ్రాంథిక భాషగా విమర్శించడాన్ని ముందుగానే గ్రహించిన తిరుపతి వేంకటకవులు, భాష సజీవంగా జీవించడానికి, కవులు కాలానుగుణ్యంగా మారుతూండవలసి వస్తుందని అన్నారు.

ఏ భాషలోనూ లేని అవధాన ప్రక్రియను తెలుగులో ప్రాచుర్యానికి తెచ్చిన కవులు తిరుపతి వేంకటకవులు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వారు తమ విజయయాత్రలో ఎన్నెన్నో రాజ్యాలనూ, రాజదర్బారులను సందర్శించి, తమ కవితలతో వారిని అలరించడం వారి సత్కారాలను అందుకున్నారు. అక్కడక్కడ దర్బారుల్లో కవులను తమ పాండిత్య గరిమతో ఓడించి విజయపత్రాల నందుకున్నారు. ఎన్నో కావ్యాలు వ్రాశారు. అయినా వారు తమనింతగా చేసిన తెలుగు భాష కలకాలం నిలవాలనీ, ముందు తరాలవారు తెలుగు వెలుగుతో తరించాలని ఆకాంక్షిస్తూ కవులు కాలానుగుణ్యంగా మారాలని ఈ క్రింది పద్యాన్ని చెప్పారు!

**కాలము బట్టి దేశమును గాంచి ప్రభుత్వము నెంచి దేశభా**
**షాలలితాంగి మారుటది సత్కవి సమ్మతమౌట నన్నదే**
**శ్శాలును నాంధ్రభాష గల వౌటను నొచితిబట్టి మేము క**
**బ్బాలను వాడుచుంటిమని పండితులే గదితి నొప్పుకుందురో.**

- అంటూ పద్యములను విడిచిపెట్టి, గద్యంలోన కవిత చెప్పాలని కాదు. సంకర భాషను బుల్లితెర, సినిమా వారు జనం మీద రుద్ది భాషా విలువను భంగపరచవద్దని, తెలుగు మాధుర్యాన్ని నీరసింపచేయవద్దని వారు సవినయంగా తెలియజేశారు. తిరుపతి వేంకట కవుల్లోని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారికి మీసాలున్నాయ్, దాన్ని వారు సుదహరిస్తూ - వారు ఆ రెండు మీసాలూ ఆంధ్ర సంస్కృతాలకు చిహ్నంగా పెంచామన్నారు. వారు సంస్కృతాంధ్ర సంగమంగా పద్యాలు వ్రాసినప్పటికినీ - ఆ పద్యాలు పండిత పామర రంజకాలయ్యాయి. పండిత పామర రంజకమైన కురుక్షేత్రం (పాండోవోద్యోగ విజయములు) నాటకమే నేటికీ నిదర్శనంగా కనిపిస్తుంది. వారు సర్వకాలములకు సరిపోయే కవిత్వం ఆలోచించే కవిత్వం రచించారనడానికి వారి నాటకాలే, ఋజుపరిచాయ్. ●

*(11వ పేజీ తరువాయి)*

కృష్ణదేవరాయల కాలంలోని పోషక కవుల్లో అష్టదిగ్గజాలుగా ఖ్యాతి వహించినవారిని మాత్రమే మనం లెఖ్ఖల్లోకి తీసుకుంటున్నాం. 1335 సం॥ములో విద్యారణ్యుల ఆశీస్సులతో హరిహరరాయలు, బుక్కరాయలు విజయనగర సామ్రాజ్య స్థాపనం చేసిన నాటినుంచీ - సాళ్వ నరసింహరాయలు వరకూ ఎందరెందరో మహాకవులు సాహిత్యారాధనం చేశారు. తెలుగు సరస్వతికి నీరాజనం పట్టారు. కొందరు చరిత్రకు అందకుండా పోయారు. సాళ్వ నరసింహారాయలు అన్నమయ్యను ప్రోత్సహించి, రాగిరేకులపై కవితలు నిక్షిప్తం చేయకపోతే - ఆ మహామహుని 32 వేల కృతులనూ, 12 శతకాలనూ ఎరుకకు వచ్చేవి కావు. ఆయన తొలి కవితా పితామహునిగా గుర్తుంచుకోగలిగే వారం కాము. అలాగే కూచిరాజు ఎర్రన, నందిమల్లన, ఏల్చూరి, సింగన, అనంతుడు వంటి కవుల విలువలను గ్రహించేవారము కాము. కూచిరాజు ఎర్రన - సకల పురాణ సంగ్రహం, కొక్కోకం, నందిమల్లన -మదన సేనం, ప్రబోధ చంద్రోదయం, అనంతుడు, బంధం కావ్యం వ్రాసినట్టు విదితమైంది. ఇహ పిల్లలమర్రి వీరభద్రుడు శాకుంతలం, జైమినీ భారతం, పాల్కురికి సోమనాధుడు వృద్ధసాలభంజిక వ్రాసినట్లు కొందరికైనా విదితం.

ఈ ప్రాచీన కవులందరి కృషీ లేకపోతే - ఈనాడు ఇంతటి సాహిత్యం మన తెలుగువారికి అందేది కాదు. ఈ సాహిత్యం కూడా ఆధ్యాత్మికపరంగా జనించబట్టే యుగయుగాలుగా నిలిచిపోయింది. తెలుగువారు ధర్మబద్ధంగా త్యాగశీలంతో, దాన విలసితతో జీవనం కొనసాగిస్తూ, దేశాన్ని సస్యశ్యామల కోమలంగా, సుజల ఫలపూరంగా చేస్తూ, వ్యవసాయ సంపన్న, అన్నపూర్ణగా తీర్చిదిద్దడంలో కవుల ధర్మదృష్టి గల పాత్రే కారణం. ●

## ప్రముఖాంధ్ర 22 సంవత్సరంలోకి అడుగిడుతోంది. 2016 సం॥ము డిసెంబర్ నెల సంచికతో 22 సంవత్సరములు వయసును పూర్తి చేసుకుని 23 సంవత్సరము వయసుకు వస్తూంది.

ప్రపంచంలోని ఏ తెలుగు పత్రికా, ఇలా ప్రపంచవ్యాప్తిగా ఉన్న తెలుగువారిని గుర్తించి పంపిణీ కాబడుతున్నదన్న సత్యం ఎంతమంది తెలుగువారు గుర్తించారో సంఖ్యాపరంగా చెప్పలేము.

అమెరికాలోని న్యూజెర్సీ నుంచి వెబ్ ఎడిషన్ ప్రసారమవుతూంది. ఆయా దేశాల్లోని తెలుగు ప్రముఖుల్ని గుర్తించి వారందరికీ పత్రికలను పంపుతున్నాం.

పలుదేశాలకు సంపాదకులు వెళ్ళి అక్కడి సమావేశాల్లో తెలుగువారిని తెలుసుకుని వారికి కూడా పత్రికను నెలానెలా పంపుతున్నాం. వారిని గూర్చిన వివరాలను ప్రచురిస్తున్నాం. ఏ దేశంలో ఏ తెలుగువారున్నప్పటికినీ వారు అందరూ మాకు ప్రముఖాంధ్రులే! అక్కడ ఉన్న తెలుగు సంఘాలూ, నాయకులూ, సభ్యులతో ముఖాముఖీ గోష్ఠి జరుపుతూంటాం.

ఇవ్విధంగా ప్రముఖాంధ్ర ఎందరో విదేశాంధ్రులను పరిచయం చేసుకున్నది.

ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భావ సందర్భంలోనే ప్రముఖాంధ్ర పత్రిక అప్పటి అధ్యక్షులు శ్రీమాన్ వి.యల్ దత్తు గారి సువర్ణ హస్తాలతోనే ప్రారంభించబడింది. ప్రముఖాంధ్ర పత్రికాపుష్పం కుసుమించడానికి వెనుక మా శ్రేయోగాములూ, ఆంతరంగిక మిత్రులైన శ్రీమాన్. యు. విశ్వేశ్వరరావుగారి ప్రోత్సాహం ప్రోద్బలమూ ఎంతగానో ఉన్నది. అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ప్రొఫెసర్ డా॥సి. ఎం.కె. రెడ్డిగారి ఆదరణ ఉన్నది. కళాసాహితీ రంగాల పోషకుడూ, ప్రోత్సాహకుడైన కీ॥శే॥ ఎల్వీ రామయ్యగారి సహకారం లభించింది. వారి మూలకంగా పరిచయమైన నల్లికుప్పుస్వామి చెట్టిగారి సహకారం ఈనాటికినీ నిర్విరామంగా కొనసాగుతూంది. ముఖ్యంగా ఆర్యవైశ్యులు అహరహ ప్రోత్సాహం లభించకుంటే ప్రముఖాంధ్ర ఇంతకాలం నిలిచి ఉండేదికాదు.

వీటన్నిటికీ మించిన పూజ్యులు, గురువులూయైన శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వాములవారి మంగళాశాసనం ఇప్పటికినీ బలవర్ధక ఔషధంగా పనిచేస్తుంది.

వీటన్నిటికీ మించినది చెన్నపట్టణంలోని నా ఉనికి అన్ని వర్గాల వారి ఆదరణ పొందడం నా భాగ్యం. ఎంతోమంది గురువులు నాయింటిని సందర్శించి నా ఆతిథ్యాన్ని పొంది మనసారా ఆశీర్వదించడం నాకు అభ్యున్నతిని కలిగించింది.

వీటన్నిటికీ, వెనుకనుండి, మంచికార్యాలు చేయించిన నా సతీమణి కీ॥శే॥ రాలైన సత్యవతి ప్రధానకారణం. ఆమె ప్రేమ, ఔదార్యం లేకపోతే సాధుసేవా, సాహిత్యసేవా చేయలేకపోయేవాణ్ణి. 2002 సంవత్సరంలో నన్నొంటిచేసి వెళ్ళినా ఈనాడూ నా గృహదేవతగా, కల్పవల్లిగా నా హృదయంలో నిలిచిపోయింది. నా ప్రాణాలను అనంత విశ్వంలో కలిసిపోకుండా చూస్తూన్నది. దురదృష్టమల్లా భౌతికంగా ఆమె లేకపోవడమే.


ఒక్కొక్కప్పుడు ఆమె నాలోనే అంతర్గతంగా ఉందనే భావిస్తూంటాను.

**- గోటేటి శ్రీరామారావు**

## దేశీయంగా పండే బియ్యం, ఉప్పూ, పప్పు ధాన్యం, కూరగాయలూ, పండ్లూ ఫలాల ధరలు పెరిగిపోవడం సిగ్గుచేటు అన్నాడు వేమన!

**ఉప్పు, చింతపండు, ఊరిలో నుండగా కరువదేల వచ్చె కాపులార!**
**తాళకంబెరుగవా, తగరంబు నెరుగరా -**

అంటూ ఆయన ప్రజలను, ప్రభువులనూ ఆనాడే ఆయన ఎద్దేవా చేశారు.



ఉప్పు, పప్పు, చింతపండు, బెల్లం, అల్లం, పంచదార, బియ్యం, కాయగూరలు, ఫలపుష్పాలు ఇవన్నీ ఊరిలోని పొలాలు పొలంగట్లపై, ఉప్పు సాగర జలాలతోనూ దండీగా పండేవి. ఇలా పండించేవారు వాటిని తెచ్చి అమ్మేవారు, పాలన చేసే పాలకులూ - వీరందర్నీ కాపులుగా జమకట్టి - కరువెలా వస్తుందిరా అని ప్రశ్నించారు వేమన. ప్రశ్నిస్తూనే - తాళకం తగరాలతో బంగారం తయారుచేసి వాళ్ల మొఖాన్ని కొట్టండి అన్నాడాయన. ఆరోజుల్లో తాళకం తగరాలతో బంగారాన్ని తయారుచేసేవారు. అయితే అలా బంగారం తయారుచేయడం జీవికి దరిద్రహేతువని మానేశారు. వేమన అభిరాముడు ఆరోజుల్లో ఖైదీయైన వాళ్లన్నగారిని విడిపించుకోవడానికి బంగారం తయారుచేసి, కప్పం కట్టలేదన్న చక్రవర్తుల మొఖాన్ని కొట్టారు. అది చేసినవారు, గ్రహించిన చక్రవర్తులూ - రెండు వర్గాలవారూ పోయారు. అలాగే ఆశతో, దరిద్రంగా ఊరిలో పెరిగే ఉప్పు, పప్పు, ధాన్యాలనూ, బియ్యం కాయగూరల్ను బంగారంతో సమంగా ధరవరులు పెంచుతున్న వెధవల ముఖాల్నీ, దాన్ని చూస్తూ మిన్నకుండిన ప్రభుత్వ, అధికార వర్గాల వారి మొఖాల్ని కొట్టండని ఆనాడు వేమనగారు చెప్పారు.

పంట పొలాల్లో, చేలల్లో పండిన ధాన్యం, పంటలను, కూరగాయల్ను, రైతులూ, ధనవంతులూ తమకు సరిపోగా ఉంచుకుని, శేషాన్ని 'బండిపంతుళ్లకూ, బీదాబిక్కీ, గ్రామ మునసబు, కరణాలకు పంచుతూండేవారు. మిగిలినవాటిని, అమ్మకాలకు పంపేవారు. ఆంధ్రదేశంలో 'అన్నము'ను అసలు అమ్ముకునేవారు కాదు. ఏరోజు ఏ పూట యింటికి అతిథులు వస్తారా, వారికి భోజనం పెట్టి, తాము తిందామా అని చూచేవారు. ఈనాడు వీధి వీధికీ అన్న, పలహారాలను విక్రయించే హోటళ్లే! ఈనాటి స్టార్ హోటళ్లతో సమానంగా వాఋ భోజనం రేట్లను పెంచేశారు. 20 లేదా 30 రూపాయలకు ప్లాస్టిక్ ఆకులూ, బొచ్చెల్లో ప్లేటు భోజనం పెడ్తున్నారు.

దేశంలో పండే ధాన్యం, కూరగాయలూ, పళ్లూ, ఫలాల్ను దారుణంగా ధరవరుల పెంచీ విక్రయించడమేఁమి రోగమండీ! రూపాయకు రెండు కుంచాల బియ్యం యిచ్చే రోజులు పోయి, ప్రభుత్వ పథకాల్లో పేదలకు మాత్రమే కిలో బియ్యం రెండు రూపాయలు చేసి అమ్ముతున్నారు. మధ్య మీదు తరగతులవారు కిలో 20, 40, 50 రూపాయిలిచ్చి బియ్యం, పప్పు ధాన్యాల్ని కొనుక్కోవలసిందే! శేరు అణాకిచ్చే ఉప్పు శేర్ల కొల్తలతో బాటు ధరవరుల్లో కూడా మార్పు వచ్చింది. ఇప్పుడు వచ్చే సాల్టు పౌడర్, చింతపండూ, చిటికెడు కూడా రూపాయికి రాదు. ఇందుకు కారకులైన వెధవల్ని ఏం చేయాలో ఓట్లు వేస్తున్న జనం, ఓట్లు అడుక్కుంటున్న నాయకులే చెప్పాలి. ●

# భారతదేశమా, భాగ్యోపేతమా!
## ఈ రాజకీయ భూత, ప్రేత, పిశాచాల నుంచి నీవే రక్షించాలి!


**భరతవర్షే - భరతవర్షంలో హర్షం, వర్షం తక్కువ!**

**భరతఖండే - ఖండఖండాలుగా విడిపోయింది!; ఇంకా పోనున్నది!**

**జంబూ ద్వీపే - ఇతర దీపవాసులెక్కువ!; దీనావస్థలెక్కువ!**

**గంగ- కావేరీ, కృష్ణా- గోదావరీ - జీవనదులున్నప్పటికినీ జీవించే వారికి నీరు దొరకదు!**

ఇలాటి వార్తలు వింటూంటే, ఇపుడే ఒళ్లు జలదరిస్తుంది. కాళ్ల క్రింద భూమి కంపిస్తున్నది.



ఉన్నవాడికే యిళ్లు పెరిగిపోతున్నాయ్, లేనివాడికి సంపద తరిగి పోతూంది. బీదా పేదా పేరు చెప్పుకునే ప్రతీవాడూ సంపదల్ని గోదాముల్లోకి దింపుకుంటున్నాడు. పట్టణాలూ, గ్రామాలూ, అంతస్థుల కంతస్థుల భవనాలతో, పరిశ్రమలతో నిండిపోతున్నాయ్. పాడిపశువులూ, వన్య మృగాలూ మనుష్యులకు ఫలహారము లయి పోతున్నాయ్. పాడిపంటలు తరిగి పోతున్నాయ్. పోషక పదార్థాలు ఆహార దినుసుల్లో తగ్గినందున మందు లతో సాగిస్తున్నారు. కొన్నాళ్లిలా గడిస్తే తిండికి కూడా విటమిన్ బిళ్లలా మందులు మింగవలసి వస్తుందేమో! చెట్లపై పక్షులవలె ఆవాసం కల్పించుకోవలసి వస్తుందేమో! (క్షమించండి చెట్లను కొట్టేస్తున్నారు కాబట్టి - ఇక ముందు అదీ సాధ్యం కాదేమో!)

మా ముందు తరం తల్లి తండ్రులకు పది నుంచీ పద్నాలుగు మంది వఱకూ సంతానం ఉండేది. అలాటపుడే, బారత జనాభా 42కోట్లు దాటలేదు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు వేఱుపడినా జనాభా తగ్గలేదు సరికదా, జనాభా సంఖ్య హెచ్చు సంఖ్యలో, కోట్లలో పెరుగుతూందంటే, కారణలేం విటో రాజకీయ నాయకులూ, మత పెద్దలకే తెలియాలి! ●

1. యిదీ ఈనాటి భారతవర్షమూ, భరతఖండమూ అనబడు భారతదేశం పరిస్థితి. కలలోనైనా ఎవరూ భారతదేశమని పిలుచుకోవడం లేదు, అసలు భారతీయుల మనిపించుకోవడం లేదు! వీలైతే ఎవరికి వారుగా హక్కులు కోరి, విడివడదామని చూస్తున్నారు. ఈ కు- తంత్రాలు చూస్తూంటే- ఆనాటి చిన్న చిన్న సంస్థానాలుగా దేశం ఛిన్నాభిన్నమై మరల యే విదేశస్థుల పాల(న) వుతుందేమోనని సంశయం కలుగుతూంది!
2. 110 కోట్ల వఱకూ ఉన్న యీ జనాభా, సంవత్సర సంవత్సరానికీ కోటి కోటిగా పెరిగేట్టుంది. రోజు రోజుకూ 70 లక్షల జనం పుడుతున్నట్టుగా తెలుస్తూంది. ప్రపంచ పరంగా చూస్తే, భారత జనాభా ఆరో వంతు ఉన్నది.
3. చైనా తరువాత మనదేశ జనాభాయే ఎక్కువ. అయితే చైనా చేస్తున్న ఉత్పత్తులనూ, ఎగుమతులనూ భారతదేశం చేయడంలేదు. అమెరికాలో పెన్సిల్, పెన్ను నుంచీ సమస్తమూ చైనా నుంచే వస్తున్నాయ్. చివరకు కాయకూరలు కూడా! కుప్పలు కూలిన జనాన్ తెప్పలా తేలింది, ఉత్పత్తి పెంచింది.
4. వ్యవసాయక దేశమైన భారతదేశంలో ఫలసాయం లేదు. వరి పండించే ప్రతీ చేనూ, పొలమూ జన వాసాలతో నిండిపోతుంది, కాలుష్య రహితమైన గ్రామాలు హరించిపోతున్నాయ్. పచ్చదనం పారిపోతుంది, భూమి వెచ్చదనాన్ని పెంచుకుంటూంది. ఇంకో రెండు దశాబ్దాలు ఇలాగే గడిస్తే కూడూ గూడులకే కాదు; గాలి నీరులకు కూడా తగువులాడుకో వలసివస్తుంది. చచ్చిన వాళ్లను పూడ్చడానికే స్థలము ఉండదు. ఇప్పటికే చాలా చాలా సమాధులతో నగరాలు నిండిపోయాయి. సాగరాలు కూడా కుదించుకుని పోతున్నాయ్!

SRI RAJARAJESWARI
JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*
HOTEL MAYURA
204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

తనువు భారతీయం మనము ఆంధ్రము !

# తేట తెనుగు తుమ్మల!

'దేవుడంటే దేశం, దేవతలంటే ప్రజలు' అని నమ్ముతూ, చివరి వఱకూ బ్రతికిన తెనుగు కవి తుమ్మల సీతారామమూర్తి. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలోని కావూరి గ్రామంలో 1901 సం॥ము డిసెంబర్ 25న జన్మించారు. ఆయన తండ్రి నారయ్య, తల్లి చెంచమాంబ. అక్షఱములను చదవనప్పటికినీ, అక్షయమైన పురాణజ్ఞానం ఆయనకు ఉండేది. ఊరిలో ఆయన పురాణములు చెప్పి, 'ధర్మజ్యోతి'గా బ్రతికారు. సీతారామమూర్తిగారి కవిత్వంలో నన్నయ, తిక్కన, ఎఱ్ఱన వంటి కవిత్రయంపోకడలు వారి రచనల్లో ఉన్నప్పటికినీ– 'అభినవ తిక్కన'గా ఆయన్ను కీర్తించినపుడు, సున్నితంగా 'తెలుగు లెంక' అనండీ చాలుననేవారు, అలాగే ఖ్యాతిగాంచారు.

ప్రజల సుఖదుఃఖాల్లో పాలుపంచుకొనే వారికే సద్భావనం కలుగుతూ సత్కృతమైన రచనలు వెలువడుతాయనీ ఆయన భావించారు. కాసు కోసం ఆశపడి కవిత్వం రాయలేదు. రాతిని సహితమూ స్పందింపచేసే తెలుగు కవిత్వం వ్రాశారు, తెలుగుల హృదయాలను తెలుగు వెలుగులతో నింపారు. తన కవిత్వంతో సామాజిక చైతన్యాన్ని కల్పించారు. పాత క్రొత్తా మేలికలయికతో కవిత్వంలో పదజాలాన్ని గుప్పించారు. తెలుగుదనం లేని కవిత్వాన్ని తోసిరాజన్న ఏకైక రచయిత, తేట తెలుగు రచయితా తుమ్మలపల్లి, మరో పదేళ్లు బ్రతికితే నూరేళ్లూ నింపుకొనేవారు. కానీ ఇప్పటి తెలుగువారి పోకడల్ని చూచి సహించేవారు కాదేమో!

మన కాంధ్రత్వమే ప్రాణం సుమీ, భారతీయ ధర్మం శరీరం– ఈ రెండూ కలిసినపుడే జీవి జీవి, లేనిచో జీవశ్చవం అనే ధోరణి వారిది. తెలుగు గడ్డపై పరాయితనానికిష్టపడేవారు కాదు, అరవల గోలను ధిక్కరిస్తూ 'రాష్ట్రగానం' రచించారు. గాంధీ మీద కవితలల్లి జీవితం చరితార్థమైందన్నారు. రాముని సత్యం, కృష్ణుని ప్రేమ, గౌతముని కరుణలు మూర్తీభవించిన వ్యక్తి శక్తిగా గాంధీని అభివర్ణించారు.

పరబాష, పర సంస్కృతీ, పరవేషధారణా ఆయనకు నచ్చేది కాదు. నేడు మానవునికి కావలసినది 'గుడి కన్నా గూడూ–బడీ' కావాలి! కనీస మానవుడు సుఖ సంస్కృతీ, సంప్రదాయాలతో బ్రతకాలని ఆశించారు. తనను దుర్భర దారిద్ర్యం తొంగిచూచినా, తాను మాత్రం దానివంక తొంగి చూడలేదు – అదే 'తెలుగు లెంక' తుమ్మలపల్లి సీతారామమూర్తిలోని ఔన్నత్యం!

ప్రస్తుతకాలంలో నరుడు నడక తప్పాడు, దారిని తప్పాడు; పాత విలువలు పోయాయి, కొత్త విలువలు తూర్పు పడమర లెరుగవు సరికదా; తూర్పును పడమరయనీ, పడమరను తూర్పుయనీ చెప్పడమే నాగరికతయిపోయింది. ఈ నాగరికత, నాణెతనూ, మంచినీ, సమైక్యతనూ కోల్పోతున్నది. ధనికుడు ఇంకా ధనికుడై, పేదవాడింకా పేదవాడవుతున్నాడంటూ క్షోభించారు. ఒకప్పుడు నేను కూడా 'కలిగినోడి సొమ్ము కలిగినోడికి పోతుంది. లేనోడి సొమ్ము కాంతా కలిగినోడికి పోతూంది. కలియుగ సిత్రమేంటి రోరీ–కానీ డబ్బు లేదు రోరీ' యని గ్రామ్య గీతం వ్రాశాను. ఈ భావం వారిదేనని గ్రహించినందుకు సంతోష పడ్తున్నాను. ఈనాడు చదువులోని విజ్ఞత, సంస్కారం సన్నగిల్లుతున్నందుకు ఆయన లాగే బాధపడ్తున్నాను. 'తెలుగు లెంక'లాగా 'ప్రముఖాంధ్రులు' పదిమందీ పాటు పడుతూ, తెలుగుల బాగుకు ప్రయత్నిస్తే సంతోషిస్తాను. 'తెలుగు లెంక' వందేళ్లు బ్రతకకపోయినా, బ్రతికినట్టు భావిస్తూ వినమ్రుడనై అంజలి ఘటిస్తున్నాను. ●




*పై మూర్తిని జూచి సీతారామమూర్తి అనుకోవచ్చు, తెలుగు లెంక తుమ్మలసీతారామమూర్తి యనుకోవచ్చు! దేశీయ కవిగా తల్లి భాష కూడిగం చేసే తెలుగు కవిగా, తుమ్మల సీతారామమూర్తి కన్నుమూశారు. **1990** మార్చి **21**న అస్తమించినప్పటికినీ 'కవిత నాకు ముందు– కవిత నా కాపోక నొసఁగు విందు' అన్న మహానుభావుడు. తెలుగు వాళ్ల కన్ను తెరిపించాలని 'రాష్ట్రగానం' అనే కావ్యం వ్రాశారు. సర్వోదయ గానం, మహాత్మాగాంధీ గానం, ఉదయ గానం, అనే మహత్తరమైన కావ్యాలు వ్రాశారు. వీరొకరిని సందర్శించడానికి వెళ్లినపుడు, ఎవరు నీవూ యని ప్రశ్నించగా– 'రాష్ట్రసిద్ధి కొరకు రక్తముగార్చిన కవిని నేను గాంధీ కవిని నేను! బడలి బడలి తల్లి బాస కూడెగముసేయ కవిని నేను దేశ కవిని నేను'! అంటూ దర్పంగా చెప్పుకున్నారు. ఆ ఆశువుని విని ఆ అధికారి ప్రసన్నుడయ్యారుట. మహాత్మాగాంధీ ఆస్థాన కవిగా తుమ్మలవారు పేరుపొందారు. ఆ రోజుల్లో గాంధీని చూడడానికని రైలుకట్ట వెంబడి ముప్పై మైళ్లు కాలి నడకన విజయవాడకు నడిచి వెళ్లి గాంధీని సందర్శించారు; కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గండపెండేరం, సువర్ణ కంకణం, గజారోహణం వంటి సన్మానాలందుకుని, అకాడమీ సభ్యత్వం, బహూకృత బహుమానంగా కళాప్రపూర్ణ వంటి వందుకున్నప్పటికినీ విఱ్ఱవీగి మసలలేదు, వీసమెత్తైనా గర్వం పోలేదు సరికదా, విలువ హెచ్చుగాక– విలయంబగుగాక విత్తనాల సంచి విప్పరాదు అంటూ నిరాడంబరంగానే, గాంధీకన్నా సామాన్యంగానే **90** ఏళ్లు బ్రతికి, ఈ సమాజంలో ఇక బ్రతకడం సరికాదనుకున్న కీర్తిశేషుడాయన!*

*Compliments from*
**Sri Krishna Bhat**
**When you come to**
**Holy Pilgrimage Centre Tirupati & Tirumala**
**WOOD SIDE ANNEXE**
**Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.**
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
**E.Car Street, Tirupathi. Ph : 2284464**

## తెలుగు నాటక రంగాన్ని నాలుగు స్తంభాలాట స్థాయి నుంచి నవరసాల పంటగా తీర్చిదిద్దడానికి అహరహం శ్రమిస్తోన్న సంచార నాటక ప్రయోగశాల

# చాట్ల శ్రీరాములు



ఆయన నటనా విశిష్టమైన విశేషం, ఆయన నటిస్తున్నప్పుడు ఆ నాటకంలో పాత్ర జీవిస్తుందిగాని, నటుడు కనపడడు. అపూర్వ నటనాకౌశలంతోపాటు, క్రమశిక్షణ, సభ్యత, సంస్కారం నూటికి నూరుపాళ్లు కలిగిన నట శిరోమణి అన్నారు భమిడిపాటి రాధాకృష్ణ.

"తెలుగు నాటకాన్ని నాటకీయత ఉచ్చులోంచి బయటకు తీసుకురావటానికి ప్రయత్నించిన అతి తక్కువ మందిలో చాట్ల ఒకరు అంటారు. యండమూరి వీరేంద్రనాథ్ నూట ఇరవై మూడు సంవత్సరాల నాటకరంగ వనంలో యాభైకి పైగా నవవసంతాలు పూయించిన దర్శక నటులు చాట్ల శ్రీరాములు.

1931 డిసెంబరు అయిదో తేదీన విజయవాడలో చాట్ల అచ్చయ్య, అచ్చమ్మ దంపతులకు జన్మించారు. అక్కడే హిందూ హైస్కూల్లో ఎస్సెల్సీ చదివారు. పన్నెండు సంవత్సరాల వయసులో ద్విజేంద్రలాల్‌రాయ్ రాసిన "మేవాడ్ పతనం" అనే హిందీ నాటకంలో తొలిసారిగా నటించారు. ఆ తర్వాత కాలేజీ రోజుల దాకా కూడా నాటకానికి దూరంగానే ఉన్నారు. ఎస్.ఆర్.ఆర్., సి.వి.ఆర్. కళాశాలల్లో బి.కాం. పూర్తిచేశారు.

కాలేజీలో చదివే రోజుల్లోనే గౌతమబుద్ధ నాటకంలో ఓ చిన్న వేషం వేశారు. ఇక ఆనాటినుంచి ఆయన నాటక రంగాన్ని వదల్లేదు.

1956లో ఆయన రైల్వేలో ఉద్యోగంలో చేరారు. 1976 వరకు అందులోనే ఉన్నారు. ఆ ఇరవై సంవత్సరాలు ఆయన గూడ్సు రైల్లో గార్డు క్యాబిన్‌లో కూర్చొని రంగుదీపాల్ని, రంగుల జెండాల్ని తోడుగా పెట్టుకుని మళ్లీ స్టేషన్ వచ్చేదాకా తాను వేయబోతున్న నాటకం పోర్షన్ చదవడమో లేక ఆ నాటకాన్ని డిజైన్ చేస్తూ, ఏదో రాసుకోవడం చేసారు. ఇరవై సంవత్సరాల కాలాన్ని గార్డుగానో, టికెట్ కలెక్టరుగానో గడుపుతూ తెలుగు నాటకరంగంలో తనదంటూ ఒక ట్రెండ్‌ని సృష్టించారు.

నాటకాల్లో చేస్తోన్న ఆయన సంచలనంలు గుర్తించిన ఆంధ్ర విశ్వ విద్యాలయం నాటక శాఖలో అధ్యాపకుడిగా చేరమని ఆహ్వానించింది. అలా అధ్యాపకుడుగా చేరి ప్రైవేటుగానే ఎం.ఏ. పాసయ్యారు. రైల్వేలో పనిచేసే రోజుల్లోనే ఆయన 1970లో లండన్‌లోని "బ్రిటిష్ డ్రామా లీగ్"లో నాటక శాస్త్రాన్ని అభ్యసించారు. విదేశీ నాటక రీతుల్ని అధ్యయనం చేశారు. "పెళ్లిచూపులు, మాస్టర్జీ, దొంగవీరుడు, పుణ్యస్థలి, విముక్తుడు వంటి నాటకాల్లో తొలి రోజుల్లో ఉత్తమ నటనకు అవార్డులు, బహుమతులు పొందారు. 1956 ప్రాంతాల నుంచీ ఆంధ్ర దేశంలో నటించని వేదిక లేదు. అయితే తొలిసారి ఆయన హైదరాబాద్ విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ పక్షాన "పుణ్యస్థలి" నాటికకి దర్శకత్వం వహించారు. ఇక అప్పట్నుంచీ నూటయాభై నాటికలు, నాటకాలకు దర్శకత్వం వహించారు. 1976 నుంచి 1982 వరకు, తిరిగి 1985 నుంచి 1987 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాటక శాఖలో అధ్యాపకులుగా పనిచేశారు. 1982 నుంచి 85 వరకు, 87 నుంచి పదవీవిరమణ వరకు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని నాటక శాఖలో అధ్యాపకుడిగా పనిచేశారు. అప్పట్లో పుణ్యస్థలి, అరణి, మరో మొహంజొదారో. లావాలో ఎర్రగులాబి, త్రిజాకీయమ దర్శనం, చీకటి చెప్పిన కథ, సత్యంగారిల్లెక్కడ.

తూర్పు రేఖలు, అతిథి, నీలిదీపాలు, పల్నాటి వీరచరిత్రలా ఒక్కింతయు లేదు. టామిటామి, గోటుహెల్, డామిట్ కథ అడ్డం తిరిగింది, పాపం ఉరితీస్తారు కాబోలు, మాంగల్యానికి మరోముడి, ఆషాఢ మేఘం, మన్మథుడు మళ్లీ పుట్టాడు, జగన్నాటకం, నటసామ్రాట్, ఇలా నాటిక, నాటకాలాన్నీ చాట్ల దర్శకత్వం ప్రతిభని చాటినవే!

దర్శకుడిగా చాట్ల శ్రీరాములు సాధించిన అపూర్వ విజయమే తెలుగు సాంఘిక నాటకరంగం సాధించిన విజయం. ఆయనకు ప్రపంచంలో ఎన్నిరకాల థియేటర్లున్నాయో వాటిపట్ల అవగాహన ఉంది. సాధికారత ఉంది. అందుకనే ఆయన నాటక రచయిత ఊహించనిధంగా కూడా ఆయన దృశ్యాల్ని రంగస్థలంమీద ఆవిష్కరించగలుగుతున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో, హైదరాబాద్‌లో వందలమందికి తన నటనా మార్గంలో శిక్షణనిస్తున్నారు. ఆకాశవాణిలో, దూరదర్శన్‌లో, సినిమారంగంలోనూ నటించినాతన ప్రాధాన్యం మాత్రం రంగస్థలానికే. ఆయన దర్శకత్వం వహించిన వందలాది నాటికల్ని పరిశీలిస్తే ఆయనకి పేరు ప్రఖ్యాతులు తెచ్చినవి. అవార్డులు మోసుకొచ్చినవి అన్నీ ఎంతో విలక్షణమైనవే! కుటుంబ విషయాలు, హాస్యం, సమాజానికి సందేశం ఇచ్చేవి, ట్రాజెడీలు, చారిత్రకాలు, వ్యవస్థపట్ల తిరుగుబాటు ప్రదర్శించేవే. అయితే నాటికని రంగస్థలం మీద ఎలా ఆవిష్కరిస్తారనడానికి ఆయన మార్గదర్శకాలు ఏవీ పాటించలేదు. వస్తువు, పాత్రల స్వభావంనుసరించి ఏ నాటికని ఎలా ప్రదర్శించాలో అలాగే ప్రదర్శించేవారు. ఆయన ప్రదర్శన చూశాక ఈ నాటికని ఇంతకన్నా బాగా ప్రదర్శించడం సాధ్యం కాదనే భావన ఏ దిగ్దర్శకుడికైనా కలిగి తీరాల్సిందే. హైదరాబాద్ మొదలుకొని ఎక్కడైనా సరే నట శిక్షణ శిబిరాలో, ఇంకా ఏవో నిర్వహిస్తూ నటనపట్ల ప్రజల్లో ఇష్టం, అభిమానం కలగడానికి కృషిచేస్తున్న వారిలో అనేకులు చాట్ల శిష్యులే. "మరో మొహంజొదారో" నాటికతో తెలుగులో ప్రయోగాత్మక నాటకాలకు శ్రీకారం చుట్టిన శ్రీరాములు నటుడుగా, దర్శకుడిగా, అధ్యాపకుడిగా, వక్తగా, వ్యాసకర్తగా, న్యాయ నిర్ణేతగా నాటకరంగాన్ని జీవితరంగంలా మలచుకొన్నారు. కరంత్ కన్నా, శ్యామ్‌బెనెగల్ కన్నా తక్కువ కాదు! ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ 'కళాప్రవీణ' బిరుదు యిచ్చింది.

– చీకోలు సుందరయ్య సౌజన్యంతో